


వినోదం.. వికాసం.. విజ్ఞానం

బెల్లంపల్లిలోని సీఓఈ గురుకుల విద్యాలయం అన్ని అంశాల్లో ప్రత్యేకత చాటుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎంశ్రీ పథకానికి ఎంపికైంది. 8లో▸



మండుతున్న పుచ్చకాయ ధర

జిల్లాలో పుచ్చకాయల పంటను కేవలం 124 ఎకరాల్లో సాగు చేశారు. వేసవిలో డిమాండ్ ఉండటంతో వ్యాపారులు ధరలు పెంచి అమ్ముతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
40.5 /27.8

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి అధికంగా ఉంటుంది. సాయంత్రం చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

25 నుంచి 'ఓపెన్' పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఈ నెల 25 నుంచి మే 2 వరకు ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచడంతోపాటు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపుల్లో తనిఖీలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని కిరాణా షాపుల్లో సోమవారం జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి జలీల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్థానిక పంకజ్ కిరాణంలో తనిఖీలు చేపట్టగా.. 26 కిలోల బియ్యం బ్యాగులో 25 కిలోలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. కిలో బియ్యం తక్కువగా ఉండటంతో యజమానికి రూ.20,000 జరిమానా విధించి కేసు నమోదు చేశారు.

18 నుంచి ఫుట్‌బాల్ పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20 వరకు గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో వేణుగోపాల్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా యాజమాన్యం ఒక ప్రకటనలో వెల్లడించింది. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు హైదరాబాద్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కరీంనగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చంద్రపూర్, వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి 12 జట్లు పాల్గొంటాయని అధికారులు తెలిపారు. నాకౌట్ పద్ధతిలో కొనసాగే ఈ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.30వేలతో పాటు ట్రోఫీ అందించనున్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మూడు రోజులపాటు భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు అందించే స్కిల్ డెవలాప్‌మెంట్ కోర్సుల దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు ఈ స్కిల్ డెవలాప్‌మెంట్ కోర్సులకు అర్హులని, 38 వృత్తి శిక్షణ కోర్సుల్లో ఆసక్తి గల వారికి శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. కాస్మోటాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్, సెల్‌ఫోన్ టెక్నీషియన్, టూ వీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ అండ్ డీటీపీ, లైట్ మోటర్ వెహికల్ డ్రైవర్, ఇంటర్నల్ ఆఫ్ థింగ్స్ వంటి కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలోని యువత సింగరేణి వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈ నెల 30లోగా గోలేటిలోని ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తు ఫారం అందించాలని కోరారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం



జీఎంకు ఆహ్వానపత్రిక ఇస్తున్న సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి సోమవారం ఆలయ కమిటీ సభ్యులు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌ను ఆహ్వానించారు. మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వనమాల మురళీ మాట్లాడుతూ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ సంతోష్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, కమిటీ సభ్యులు సుదర్శన్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, చెన్న సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పు.. ముప్పు!



జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- గడిచిన నాలుగేళ్లలో 173 అగ్ని ప్రమాదాలు
- రూ.1.86 కోట్ల ఆస్తి నష్టం
- పెరిగిన ఎండలతో ప్రమాదాలకు ఆస్కారం
- అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు
- ఈ నెల 20 వరకు వారోత్సవాలు

ఆసిఫాబాద్: ఎండలు దంచికొడుతున్నాయి. మళ్లీ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటాయి. సోమవారం సైతం రెబ్బెన మండలం వంకులంలో 42.9 డిగ్రీలుగా నమోదైంది. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నపాటి నిప్పు రవ్వ కూడా రూ.లక్షల ఆస్తిని బూడిద చేస్తుంది. జిల్లా కేంద్రం ఏర్పాటు అనంతరం కొత్తగా ఆస్పత్రులు, పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లు, పరిశ్రమలు, భవనాలు పెరిగాయి. నిర్మాణ సమయంలోనే అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా యజమానులు పాటించడం లేదు. కనీస నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సమయంలో నష్టం ఎక్కువగా ఉంటుంది. అలాగే మారుమూల గ్రామాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్స్, ఇతర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే అగ్నిప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుంది. అగ్నిమాపకశాఖ సైతం ప్రమాదాల నివారణపై దృష్టి సారించింది. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించనున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఆసిఫాబాద్‌అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు లీడింగ్ ఫైర్‌మెన్ నర్సింగ్‌రావు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు పాటించాల్సిన నిబంధనలను ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులకు కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది మహేశ్‌కుమార్, రాము, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో డివిజన్‌కు ఒకటి చొప్పున జిల్లా కేంద్రం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో మాత్రమే ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో కేంద్రం పరిధిలో 7 నుంచి 8 మండలాలు ఉన్నాయి. ఆసిఫాబాద్ అగ్నిమాపక కేంద్రం పరిధిలో ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, తిర్యాణితోపాటు ఏజెన్సీ మండలాలకు సేవలందిస్తున్నారు. అలాగే కాగజ్‌నగర్ కేంద్రం ద్వారా కాగజ్‌నగర్, సిర్పూర్(టి), దహెగాం, బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్ మండలాలకు సేవలందిస్తున్నారు. కొన్ని గ్రామాలు ఫైర్‌స్టేషన్లకు దూరం ఉండటంతో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో సకాలంలో ఫైరింజన్లు ఘటనా స్థలికి చేరుకోలేకపోతున్నాయి. ప్రమాదంలో ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో ప్రధాన పంట పత్తి కావడంతో 22 జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులు, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. జిన్నింగ్ మిల్లుల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లుతుంది. నాలుగేళ్లలో జిల్లాలో 173 అగ్ని ప్రమాదాలు జరగగా.. రూ.1,86,23,800 ఆస్తి నష్టం వాటిల్లింది. ఒకరు మృత్యువాత పడ్డారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన

ఏటా ఏప్రిల్ 14న అగ్నిమాపక దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1944 ఏప్రిల్ 14న ముంబై ఓడ రేవులో జరిగిన అగ్నిప్రమాదానికి జ్ఞాపికగా జాతీయ అగ్నిమాపక దినోత్సవం జరుపుకొంటున్నారు. ఈ నెల 14 నుంచి జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అగ్నిప్రమాదాల నివారణలో అమరులైన అగ్నిమాపక అధికారులు, సిబ్బందికి నివాళులర్పించారు. రెండో రోజు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 16న రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో అవగాహన సదస్సులు, 17న విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు, 18న ఎల్‌పీజీ గోదాములు, పరిశ్రమల్లో అవగాహన సదస్సులు, 19న ఆసుపత్రుల్లో అవగాహన సదస్సులు, ఇక చివరి రోజు 20న ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కులు, పాఠశాలలు, సినిమా థియేటర్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు.

జిల్లాలో నాలుగేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	ఆస్తి నష్టం (రూ.లలో)
2020- 21	52	25,77,300
2021- 22	30	38,71,000
2022- 23	39	41,75,500
2023- 24	52	80,00,000

శిథిలావస్థలో కార్యాలయాలు



శిథిలావస్థలో జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం

జిల్లా కేంద్రంలో 1984లో అగ్నిమాపక కార్యాలయం ఏర్పాటు చేశారు. తొలుత వివేకానంద చౌక్ సమీపంలోని పాత గ్రామ పంచాయతీలో కార్యాలయం కొనసాగగా, అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట కొత్తగా అగ్నిమాపక కార్యాలయానికి స్థలం కేటాయించారు. ప్రస్తుతం ఈ కార్యాలయ కూడా భవనం శిథిలావస్థకు చేరుకుని స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. కాగజ్‌నగర్ పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయానికి సైతం సొంత భవనం లేక ఈజ్‌గాం రహదారిలోని ఓ పాత పాఠశాలలో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల్లో సిబ్బంది కొరత వేధిస్తుంది. ఇటీవల కొత్తవారిని భర్తీ చేసినా వారు ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. ఆసిఫాబాద్ ఫైర్ స్టేషన్‌కు రెగ్యులర్ ఫైర్ అధికారి లేకపోవడంతో చెన్నూర్ ఫైర్ అధికారి సంపత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

జాగ్రత్తలు పాటించాలి

వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి. పరిశ్రమల్లో పరిశుభ్రత పాటించాలి. ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినపుడు ప్రథమంగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత సంబంధిత ఫైర్ ఆర్పడానికి ప్రయత్నించాలి. అగ్నిమాపక సిబ్బందికి సహకరించాలి. జిల్లాలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే వెంటనే 101 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

– సంపత్, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్, ఆసిఫాబాద్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న నగేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేసి, మోదీని మూడోసారి ప్రధాని చేయడం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన ఆసిఫాబాద్ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన తర్వాత ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఆసిఫాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గుడిహత్నూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు గల రహదారిని జాతీయ రహదారిగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు.

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలి

కాగజ్‌నగర్‌రూరల్: అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో సోమవారం సిర్పూర్ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులు, రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఒక జాతీయ రహదారి పూర్తయిందని, మరో జాతీయ రహదారి మంజూరైందని తెలిపారు. జిల్లాలోని కాంగ్రెస్ సమస్యలను కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా బీఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. కన్నెపల్లి ఎంపీటీసీ దుర్గం మోతీరాం, గుండాయిపేట మాజీ సర్పంచ్ దుర్గం యశ్వంత్, సోమిని మాజీ సర్పంచ్ లింగాల శంకరయ్య, బోదంపల్లి మాజీ సర్పంచ్ బుర్స నాగయ్య, నజ్రూల్‌నగర్ బెంగాలీ క్యాంపునకు చెందిన మల్లు మేస్త్రీ, ఎల్కపల్లి, లోడ్‌పల్లి గ్రామాలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్, నాయకులు భూమన్న, అశోక్, అల్లాపూర్ శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకటేశ్, శ్రీశైలం, వీరభద్రచారి, సిందం శ్రీనివాస్, శ్రీదేవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'నవభారత సాక్షరత'



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- ప్రతిఒక్కరూ అక్షరాస్యులుగా మారాలి
- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రతిఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా నవభారత సాక్షరత కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం డీఈవో అశోక్‌తో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 90,828 మంది నిరాక్షరాసులు ఉన్నారని, వీరందరినీ ఐదేళ్లలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. మొదటి దశలో 14,979 మందిని అక్షరాస్యులుగా మార్చాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ముందుగా చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు చేయడం నేర్పించి, అనంతరం క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో భాగంగా ఫోన్ వినియోగం, డిజిటల్ విద్య నేర్పిస్తామని తెలిపారు. ఒకేషనల్ స్కిల్స్ ద్వారా అక్షరాస్యతతోపాటు ఆర్థికంగా నిలబడే మార్గాలను నేర్పిస్తామన్నారు. ఫౌండేషన్ స్కిల్స్ నేర్చుకున్న వారికి ప్రాథమిక విద్య, ఆపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్స్ ద్వారా విద్యనందించి ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. మొదటిదశలో 5,992 మంది పురుషులు, 8,987 మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకమైన వాచకం, అక్షర వికాసం ముద్రించామని తెలిపారు. ఇందులో 16 పాఠాలు, 124 పేజీలు ఉంటాయని, 200 గంటల్లో బోధించాల్సి ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో ప్రధానోపాధ్యాయుడు, మరో టీచర్ సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తారన్నారు. 150 మార్కులకు 33శాతం మార్కులు పొందిన వారిని ఉత్తీర్ణులుగా గుర్తిస్తామని తెలిపారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, అధికారులు పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కిచెన్ షెడ్లు వంటి పనులు చేపట్టాలన్నారు. నాణ్యత పాటించి జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, నోడల్ అధికారి ఉదయ్‌బాబు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు పనులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలకు అవసరమైన మేర పనులు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం డీఆర్‌డీవో సురేందర్, డీపీవో భిక్షపతి, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ అధికారి సురేశ్‌తో కలిసి ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి కూలీల సంఖ్య పెంచుతూ.. పూర్తిస్థాయిలో పనులు కల్పించాలన్నారు. రోజువారీ కూలి పెరిగిన నేపథ్యంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరూ పనులకు వచ్చేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించడంతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఉదయమే పనులకు వచ్చేలా చూడాలన్నారు.

కాసుల కోసం కక్కుర్తి!

- కొంతమంది అధికారులు, పోలీసుల తీరు వివాదాస్పదం
- పనులు చేసేందుకు ప్రజల నుంచి లంచాలు డిమాండ్
- కేసులు నమోదవుతున్నా మారని తీరు
- తాజాగా ఏసీబీకి పట్టుబడిన మహిళా ఎస్సై



జిల్లా కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి

ఆసిఫాబాద్: కాసుల కక్కుర్తి పడిన కొంతమంది ప్రభుత్వ అధికారుల తీరు వివాదాస్పదమవుతోంది. ప్రభుత్వం నుంచి రూ.వేలల్లో వేతనాలు పొందుతూ ప్రజలకు సేవలందించాల్సి వారు ప్రతీ పనికి లంచం అడగటం విమర్శలకు తావిస్తోంది. తాజాగా జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై రాజ్యలక్ష్మి లంచం తీసుకుంటూ పట్టుబడటంతో పోలీసుల తీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులపై కఠిన శిక్షలు లేకపోవడంతోనే వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ వంటి శాఖల్లో లంచం లేనిదే పనులు సాగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

జిల్లాలోని ఘటనలు

ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన తర్వాత ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కొత్త మండలాల ఏర్పాటుతో నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలోనే కొంత మంది అధికారులు ప్రజల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతేడాది నవంబర్‌లో చింతలమానెపల్లి ఎస్సై వెంకటేశ్ ఓ మిస్సింగ్ కేసుకు సంబంధించి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అందించాల్సిన పాలప్యాకెట్లను పక్కదారి పట్టించి జైనూర్ సీడీపీవో శ్రీదేవి రూ.65.78 లక్షల అవినీతికి పాల్పడ్డారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు ఫిబ్రవరిలో శ్రీదేవిని అరెస్ట్ చేశారు. గతంలో జిల్లా కేంద్రానికి చెందిన ఓ రెవెన్యూ అధికారి అక్రమాలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బహిరంగంగానే ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ అధికారులు లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి తెలిపారు.

మారని తీరు..

పోలీసు, రెవెన్యూతోపాటు ప్రభుత్వ శాఖల్లో లంచాలు లేనిదే పనులు సాగడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఏటా ఏసీబీకి పలు ఫిర్యాదులు వెళ్తున్నా అధికారుల్లో మార్పు కానరావడం లేదు. ప్రతీ పనికి ఎంతో కొంత ముట్టజెప్పనిదే పనులు చేయడం లేదు. పోలీసు స్టేషన్లలో కేసులకు సంబంధించి ఆయా స్టేషన్ల ఎస్సైలు కొంతమంది ప్రజల నుంచి నిత్యం లంచాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కఠిన చర్యలు లేకపోవడంతోనే మార్పు రావడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏసీబీకి చిక్కిన ఆసిఫాబాద్ మహిళా ఎస్సై



నగదుతో ఎస్సై రాజ్యలక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: రోడ్డు ప్రమాదం కేసులో కారు యజమానిపై సాధారణ కేసు నమోదు చేసి, వాహనం విడుదలకు రూ.25వేలు లంచం తీసుకుంటూ ఓ మహిళా ఎస్సై ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమణామూర్తి జిల్లా కేంద్రంలో వివరాలు వెల్లడించారు. మార్చి 31న ఆసిఫాబాద్ మండలం బూర్గుడ సమీపంలో ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ కేసులో మంచిర్యాల జిల్లా సీసీసీకి చెందిన కారు డ్రైవర్ యహియాఖాన్‌పై సాధారణ కేసు నమోదు చేయడంతోపాటు వాహనం సీజ్ చేయకుండా వదిలిపెట్టేందుకు ఆసిఫాబాద్ పట్టణ ఎస్సై రాజ్యలక్ష్మి రూ.40వేలు డిమాండ్ చేసింది. చివరకు రూ.25వేలకు ఒప్పందం కుదిరింది. సోమవారం బాధితుడి నుంచి నగదు తీసుకుంటున్న క్రమంలో ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎస్సైని కరీంనగర్‌కు తరలించారు. కారు డ్రైవర్ యహియాఖాన్ మాట్లాడుతూ మార్చి 31న మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తుండగా.. బూర్గుడ ప్రధాన రహదారిపై ఇద్దరు వ్యక్తులు బైక్‌తో తమ కారును ఢీకొట్టారని తెలిపాడు. వారు మద్యం తాగి ఉండడంతో వెంటనే 108, 100 నంబర్లకు సమాచారం అందించామని తెలిపాడు. అదేరోజు ఆసిఫాబాద్ పిటిషన్ ఇచ్చేందుకు వెళ్తే తీసుకోలేదన్నాడు. మరుసటి రోజు ఎస్సై రాజ్యలక్ష్మిని సంప్రదించగా.. లోక్‌అదాలత్‌లో కేసు కొట్టివేసేలా సెక్షన్లు పెడతామని, అందుకు రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. ఈ నెల 4న మరోసారి స్టేషన్‌కు వచ్చామని, ఈ నెల 14న రూ.25000 ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. దీంతో ఏసీబీని సంప్రదించామని తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన ఎండీ ముబాషిర్ గ్రామంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించేందుకు నిల్వ చేశాడని సమాచారం అందిందన్నారు. ఆదివారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎండీ ముబాషిర్‌పై కేసు నమోదు చేసిన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని పేర్కొన్నారు. సిబ్బంది మధు, సంజీవ్, రమేశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

16మందిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న ఓ హోటల్ వద్ద ఈ నెల 13న రాత్రి 11.30గంటలకు జరిగిన దాడి ఘటనలో 16మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు ఒకరిపైనొకరు దాడి చేసుకోగా.. స్థానిక రాళ్లపేటకు చెందిన సద్దాం తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా దాడులకు పాల్పడిన రెండు వర్గాలకు చెందిన 16మందిని గుర్తించామని తెలిపారు. సోమవారం తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మరో ఏడుగురిని పట్టుకునేందుకు మూడు బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు.

విద్యుత్‌వైరు తెగిపడి మూడెడ్లు మృతి


మృతిచెందిన ఎద్దులు

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామంలో విద్యుత్ వైరు తెగిపడడంతో మూడు ఎద్దులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మడావి సీతారాం, పెందూర్ జంగు, పెందూర్ శంభు కు చెందిన ఎద్దులు సోమవారం ఉదయం మేతకోసం వెళ్లగా పంటపొలంలో 11 కేవీ విద్యుత్ వైర్ తెగిపడడంతో మృతి చెందాయి. ఒక్కో ఎద్దు విలువ సుమారు రూ.55 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం కారణంగా ఏటా మూగజీవాలు మృతి చెందుతున్నాయని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు, మాజీ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్ ఆరోపించారు. బాధిత రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

వినోదం.. వికాసం.. విజ్ఞానం

- పీఎంశ్రీ పథకానికి బెల్లంపల్లి సీఓఈ విద్యాలయం ఎంపిక
- విజ్ఞానయాత్రకు నిధులు సమకూర్చిన కేంద్ర ప్రభుత్వం
- వరంగల్ జిల్లా టూర్‌కు వెళ్లి వచ్చిన విద్యార్థులు


వేయి స్తంభాల గుడి వద్ద విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యాలయం ప్రతిభావంతంగా రాణిస్తోంది. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన, పచ్చదనం, పరిశుభ్రత, నీటి లభ్యత, క్రమశిక్షణ ఇతరత్రా అంశాల్లోనూ ప్రత్యేకతను చాటుకుంటోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి ఎంపికై సత్తా చాటింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 17సంక్షేమ బాలబాలికల గురుకులాలు ఉండగా వీటిలో నుంచి బెల్లంపల్లి సీఓఈ బాలుర, బోథ్, లక్సెటిపేట బాలికల గురుకుల విద్యాలయాలు ఎంపికయ్యాయి.

దర్శనీయ స్థలాల సందర్శన

పీఎంశ్రీ ప్రభుత్వ ప్రయోజిత పథకం. ప్రత్యేక నిధులు సమకూర్చి విద్యార్థుల మానసిక ఉన్నతిని పెంపొందించడం ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా విజ్ఞానయాత్ర నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 13వరకు తరగతుల వారీగా సీఓఈ విద్యార్థులను రాష్ట్రంలోని ప్రఖ్యాత దర్శనీయ స్థలాలకు తీసుకెళ్లారు. 5, 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా వరంగల్ జిల్లాలోని రీజినల్ సైన్స్ సెంటర్, కాకతీయుల కోట, చారిత్రాత్మక వేయిస్తంభాల గుడి, సైన్స్ మ్యూజియం, రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, భద్రకాళీ, పద్మాక్షి దేవాలయాలు తదితర చూపించి విజ్ఞానాన్ని అందించారు. విజ్ఞానయాత్రకు వెళ్లి వచ్చిన విద్యార్థులు తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. విద్యార్థుల మాటల్లోనే..

థ్రిల్ అయ్యాను



రామప్ప దేవాలయం పేరు వినడమే తప్పా ఇంతవరకు ప్రత్యక్షంగా చూడలేదు. విజ్ఞానయాత్ర వల్ల ఆ ఆలయాన్ని చూసే భాగ్యం కలిగింది. ఆ కట్టడం ఎంతో అద్భుతంగా ఉంది. 1173 నుంచి 1210 వరకు దాదాపు 40 ఏళ్లపాటు కాకతీయ రాజులు నిర్మించారని చెప్పారు. శిల్పి రామప్ప పేరుమీద గుడిని పిలవడం గొప్ప విషయం. రామప్ప గుడికి యూనెస్కో గుర్తింపు రావడం అరుదైన గౌరవం.

– వరమని సాయి ప్రజ్ఞాన్, 9వ తరగతి

సైన్స్ సెంటర్ ఆకట్టుకుంది



సైన్స్ ఎంత గొప్పదో తెలుసుకున్నాను. సైన్స్ వల్ల మానవ జీవితం ఎంతగా ప్రభావితం అవుతున్నదో ప్రత్యక్షంగా పరిశీలించాను. శాస్త్రజ్ఞులు చేసిన సైన్స్ ప్రయోగాలు, వాటి తాలూకు ఫలితాలను అడిగి తెలుసుకుని చాలా ఉత్తేజితున్ని అయ్యాను. ఒక్కో ప్రయోగం నమూనాలను పరిశీలించడం వల్ల శాస్త్రవేత్తల మేధో సంపత్తి ఏపాటిదో, ఆ ప్రయోగాల కోసం ఎంతగా పరితపించారో తెలుసుకోగలిగాను.

– బన్న అద్విక్, 8వ తరగతి

జీవావరణంపై అవగాహన కలిగింది



జంతు ప్రదర్శన శాలను సందర్శించడం వల్ల జంతువులు, మనుషులకు మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాల గురించి అవగాహన కలిగింది. జంతు ప్రదర్శన శాల ప్రకృతి రమణీయతకు అద్దం పట్టింది. ప్రకృతి ఎంత అందంగా ఉంటుందో, సకల చరాచర జీవులను ప్రకృతి ఎంతగా కాపాడుతోందో కొంతలో కొంత తెలుసుకోగలిగాను. ప్రకృతిని కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– పుల్లూరి రక్షిత్, 7వ తరగతి

ఆకట్టుకున్న వేయి స్తంభాల గుడి



వరంగల్‌లో కాకతీయుల రాజుల కోట నాటి వైభవానికి దర్పణం పట్టింది. వందల ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన కోట అద్భుతమైన శిలాసంపదకు నెలవుగా ఉంది. కళానైపుణ్యం ఎంతగానో ఆకట్టుకుంది. వేయి స్తంభాల గుడి మరో ప్రత్యేకత. ఆయా చారిత్రక కట్టడాల విశిష్టత, కాకతీయుల కాలంలో సైనికుల ధైర్యసాహసాలు ఎంత గొప్పవో చూడగలిగాను. విజ్ఞానయాత్ర నాకు ఎన్నటికీ గుర్తుండి పోతుంది.

– పోతల విరాజ్, 6వ తరగతి

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని కలిగించింది



పీఎంశ్రీ పథకానికి సీఓఈ విద్యాలయం ఎంపిక కావడం వల్ల విద్యార్థులు దర్శనీయ స్థలాలకు వెళ్లడానికి అవకాశం కలిగింది. ఇలాంటి విజ్ఞానయాత్ర వల్ల విద్యార్థులు ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకోగలుగుతారు. ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుంటుంది. పాఠ్య పుస్తకాల్లోని చారిత్రాత్మక అంశాలను చదువుకోవడంతోనే సరిపోదు ప్రత్యక్షంగా చూడడం వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం వికసిస్తుంది. విద్యార్థులు ఎంతో కొంత విజ్ఞానాన్ని పొందారు.

– ఐనాల సైదులు, సీఓఈ ప్రిన్సిపాల్, బెల్లంపల్లి

చిన్నబుగ్గ గుట్టకు కార్చిచ్చు


చిన్నబుగ్గ గుట్టపైన వ్యాపిస్తున్న పొగలు

బెల్లంపల్లి మున్సిపల్ కాల్‌టెక్స్ ఏరియా వెనకాల ఉన్న చిన్నబుగ్గ గుట్టపై కార్చిచ్చు చెలరేగింది. ఎత్తయిన గుట్టపై ఎండ తీవ్రత వల్ల ఆకస్మికంగా మంట అంటుకున్నట్లుగా తెలుస్తోంది. దీంతో గుట్టపై దట్టమైన పొగలు వస్తున్నాయి. గుట్టపై ఏర్పడిన పొగలు చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎంతో ఎత్తులో ఉన్న గుట్టపైన కార్చిచ్చు అంటుకోవడం వల్ల మంటలను ఆర్పేసే అవకాశాలు లేకుండా ఉన్నాయి. – బెల్లంపల్లి

మిస్టరీగా ఫైనాన్స్ వ్యాపారి మరణం..?

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఓ బడా ఫైనాన్స్ వ్యాపారి మరణం మిస్టరీగా మారింది. వారం రోజుల క్రితం మృతిచెందగా.. సర్వత్రా చర్చ జరుగుతోంది. సాధారణ మరణమంటూ కుటుంబ సభ్యులు కార్యక్రమాలు పూర్తి చేశారు. వారం రోజుల తర్వాత మృతిపై అనుమానాలు వ్యక్తం కావడం, పలువురు చర్చించుకోవడంతో పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. సదరు వ్యాపారి ఫైనాన్స్ వ్యాపారంలో నెలకు రూ.కోటి వరకు లావాదేవీలు నిర్వహిస్తుండేవాడు. ఆయన వద్ద ఫైనాన్స్ తీసుకుని పలు వ్యాపారులు చేసుకున్నవారు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యాపారికి జిల్లా కేంద్రంలో ఓ ముగ్గురు వ్యక్తులు అతి సన్నిహితంగా ఉండేవారు. ఇందులో ఒకరి వద్ద మృతికి సంబంధించిన కారణాలు పూర్తి వివరాలతో కూడిన ఉత్తరం ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆయన మృతికి ముందు వారం రోజులు ఓ వ్యక్తితో వరుసగా మద్యం సేవించడం, ఆ సమయంలో సుమారు రూ.కోటి వరకు ఆయన వద్దనే దాచి ఉంచినట్లు సమాచారం. సదరు వ్యాపారిది సాధారణ మరణమా..? లేక ఏమైనా జరిగి ఉంటుందా..? అని చర్చించుకుంటున్నారు. పోలీసులు సమగ్ర విచారణ చేస్తే మరణం వెనుక ఉన్న మిస్టరీ వీడే అవకాశం ఉంది. కాగా, ఈ విషయంలో ఇప్పటికే పోలీసులు కొందరిని విచారించినట్లు విశ్వసనీయ సమాచారం.

మహిళల పట్ల లైన్‌మెన్ అసభ్య ప్రవర్తన

జన్నారం: కరెంటు బిల్లుల వసూళ్ల పేరుతో ఓ లైన్‌మెన్ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడం వెలుగులోకి వచ్చింది. మండలానికి చెందిన ఓ లైన్‌మెన్ రాత్రి పూట ఫోన్ చేసి కరెంటు బిల్లు కట్టవా అని మహిళలను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కవ్వాల్ గ్రామంలో రెండు నెలల క్రితం ఓ మహిళతో రాత్రి పది గంటల సమయంలో కరెంటు బిల్లు గురించి మాట కలిపి అసభ్యకరంగా మాట్లాడినట్లు ఆరోపణలు రావడంతో ఆయన్ను నిలదీసి మధ్యవర్తి ద్వారా క్షమాపణలు చెప్పించినట్లు తెలిసింది. మరో మహిళ పట్ల కూడా ద్వందర్థాలు వచ్చేలా మాట్లాడగా, కుటుంబీకులు హెచ్చరించి వదిలేసినట్లు తెలిసింది. రెండ్రోజుల క్రితం మండలంలోని పొనకల్‌కు చెందిన ఓ మహిళ పట్ల అసభ్యకరంగా మాట్లాడి చేయి పట్టుకోవడంతో ఆమె ఆగ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపింది. మధ్యవర్తులు సదరు లైన్‌మెన్‌తో మహిళ కాళ్లు మొక్కించి వదిలేశారని తెలిసింది. లైన్‌మెన్‌కు ఇక్కడ పోస్టింగ్ లేకున్నా డిప్యూటేషన్‌పై పని చేస్తున్నాడు. సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సదరు లైన్‌మెన్‌ను ఫోన్‌లో సంప్రదించగా తనకెలాంటి సంబంధం లేదని, కావాలని ఆరోపణలు చేస్తున్నారని తెలిపాడు.

బిల్లు రాలేదని స్కూల్ గేటుకు తాళం


గేటుకు తాళం వేయడంతో స్కూల్ బయట విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: పాఠశాల భవన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదని కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు జెడ్పీ ఉన్నత పాఠశాల గేటుకు సోమవారం సంబంధిత కాంట్రాక్టర్ తాళం వేశాడు. మన ఊరు– మన బడి పథకం కింద రూ.97 లక్షలతో కాంట్రాక్టర్ హబీబ్ పాఠశాల భవనం నిర్మించారు. పనులు పూర్తయి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాలేదు. విసిగిపోయిన కాంట్రాక్టర్ సోమవారం ఉదయం స్కూల్ గేటుకు తాళం వేశాడు. సోమవారం నుంచే విద్యార్థులకు ఎస్‌ఏ– 2 పరీక్షలు ప్రారంభం కావడంతో సుమారు గంట సేపు పాఠశాల వద్దే పడిగాపులు కాశారు. విషయం తెలుసుకున్న అధికారులు మూడు రోజుల్లో బిల్లులు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ గేటు తాళం తీశాడు.

‘ఉపాధి’లో నారీలోకం

- అధికంగా పాల్గొంటున్న మహిళలు
- గ్రూపులుగా ఏర్పడి పనులు


ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

దండేపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో మహిళా లోకం సత్తా చాటుతోంది. భారీ సంఖ్యలో పాల్గొంటూ ఆదర్శనంగా నిలుస్తోంది. కొన్నేళ్ల క్రితం వరకు పలుగు, పార చేతబట్టి వ్యవసాయ కూలీలుగా పొలంబాట పట్టిన మహిళలు నేడు ఉపాధి హామీ పథకం పనుల్లో మేము సైతం అంటున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో కందకాల తవ్వకాలు, కాల్వలు, చెరువుల పూడికతీత, ఫిష్‌పాండ్‌లు, కుంటల నిర్మాణం, ఫాంపాండ్ వంటి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో పురుషుల కంటే రెట్టింపు సంఖ్యలో మహిళలు భాగస్వామ్యం అవుతున్నారు. ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకపోవడం, పనివేళలు అనువుగా ఉండడం, స్థానికంగానే పనులు లభిస్తుండడం, పనులు సులువుగా ఉండడంతో ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో మొత్తం 1,20,536 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో పనిచేసే కుటుంబాలు 63,314 ఉండగా, 42,వేల మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఇందులో మహిళా కూలీలు 29 వేలు, పురుష కూలీలు 13వేల మంది పనిచేస్తున్నారు. అంటే పురుషుల కంటే 16 వేల మంది మహిళలు ఎక్కువగా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

మహిళలకు వరం..

ఉపాధి హామీ పథకం పనులకు మొదట పురుషులే ఎక్కువగా వెళ్లేవారు. క్రమక్రమంగా మహిళలు కూడా వెళ్తున్నారు. పొదుపు కోసం ఏర్పాటైన మహిళా సంఘాల సభ్యులు గ్రూపులుగా ఏర్పడి ఉపాధి పనులు చురుగ్గా చేస్తున్నారు. ఏడాదిలో వంద రోజులపాటు ఈ పథకం కింద ఉపాధి పొందుతున్న మహిళా కూలీలు ప్రభుత్వం చెల్లించే కూలీ డబ్బులను వివిధ అవసరాలకు వినియోగించుకుని సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఏడాది దినసరి కూలీ రూ.272 ఉండగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.300 చెల్లిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


కలెక్టరేట్‌కు వచ్చిన ఐకేపీ గ్రూప్ సభ్యులు, రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: కన్నెపెల్లి మండలం మిట్టపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2006 నుంచి వడ్లు కొనుగోలు చేస్తున్నారని, ఈ సంవత్సరం కొనుగోలు కేంద్రాల మొదటి జాబితాలో లేదని తెలిపారు. యాసంగి వరి సాగు విస్తీర్ణం 2వేల ఎకరాలు పీపీరావు ప్రాజెక్టు, బోరు బావుల కింద సాగు చేస్తున్నామని, దిగుబడి వస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రం లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని కోరారు.

పెద్దపల్లి ఎన్నికల ఇంచార్జిగా ప్రభాకర్


మాట్లాడుతున్న ప్రభాకర్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జిగా బెల్లంపల్లికి చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభాకర్‌కు కాంగ్రెస్ శ్రేణులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్లేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, పలు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


రైల్వేస్టేషన్‌లో వాల్‌పోస్టర్లు పంపిణీ

మంచిర్యాలక్రైం: జిల్లాలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. జిల్లా ఫైర్ అధికారి అజయ్‌బాబు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఓ దేవేందర్, భీమయ్య, మల్లయ్య, నరేష్, అనిల్, రాజేశం, రాజేందర్, రవి, ఎండీ గఫార్, మహేందర్, కమలాకర్, రమేష్ పాల్గొన్నారు.

వలసలు ఆగేదెలా?

- బీఆర్‌ఎస్ నుంచి కొనసాగుతున్న జంపింగ్స్
- నేడు ఆదిలాబాద్‌కు కేటీఆర్ రాక
- పార్లమెంట్ సెగ్మెంట్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం


బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర పడుతోంది. మరోవైపు బీఆర్‌ఎస్ నుంచి వలసలు ఆగడం లేదు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంపింగ్స్ కొనసాగుతున్నాయి. మొన్నటి వరకు ముఖ్యనేతలు కారు మార్చగా, ఇప్పుడు ద్వితీయ శ్రేణి నాయకుల వంతు వచ్చింది. ఈ పరిస్థితుల్లో వలసలు ఆగేదెలా అనే తర్జనభర్జన పార్టీలో సాగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరగనుంది.

ఇదీ పరిస్థితి..

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ క్రమంగా ఢీలా పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ పార్టీ నుంచి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ముఖ్యనేతలు మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, విఠల్‌రెడ్డి ఇది వరకే కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి ఐకేరెడ్డి కూడా చేరుతారనే ప్రచారం ఉంది. ఇదిలా ఉంటే తాజాగా నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలోనే వారు హస్తం గూటికి చేరనున్నారు. వీరితో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారన్న ప్రచారం ఉంది. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బీజేపీలోకి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్‌లోకి ఇది వరకే పార్టీ మారారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల్లో పార్టీ బలహీన పడింది. పార్లమెంట్ అభ్యర్థిగా ఆత్రం సక్కు పార్టీ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. బూత్ స్థాయిలో కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు కేటీఆర్ పర్యటన తోడ్పడుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సహకార వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్‌తో కలిసి జిల్లా సహకార శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరీకరణ, మోడల్ బైలాల ఆమోదం, గిడ్డంగుల నిర్మాణం, సీఎస్‌సీల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి నర్సయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ సంచాలకులు వై.రమేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ముఖ్య నిర్వహణ అధికారి శ్రీధర్ రెడ్డి, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

పరిహారం పెంచాలని రైతుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జైపూర్: మండలంలోని నర్వ, ఏల్కంటి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం, కిష్టాపూర్, వేలాల, గోపాల్‌పూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు నష్టపోతున్న రైతులకు తక్కువగా నష్టపరిహారం ఇస్తూ నోటీసులు జారీ చేశారని, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని తహసీల్దార్ వనజారెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. 2017లో పార్వతి బ్యారేజీలో భూములు కోల్పోయిన రైతులకు ఒక్క ఎకరాకు రూ.8.20లక్షలు ఇచ్చారని, ఎనిమిదేళ్లు గడిచిందని, బహిరంగ మార్కెట్‌లో భూముల విలువ ఐదు రేట్లు పెరిగిందని, ఒక్క ఎకరాకు రూ.కోటి వరకు ఉందని తెలిపారు. ఇందారం ఓపెన్‌కాస్టులో అత్యధికంగా రూ.24లక్షలు ఎకరాకు ఇచ్చారని, హైవే రోడ్డుల్లో కోల్పోతున్న రైతులకు అతి తక్కువగా రూ.4.31లక్షలు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. రైతు సంఘాల నాయకులు నర్సింగారావు, కట్కూరి రాంరెడ్డి, కృష్ణమూర్తి, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.